

పోటెత్తిన భక్తజనం

కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. - 8లో



నగల దొంగలు అరెస్టు

పూతలపట్టులోని ఓ ఇంటిలో తాళం పగల కొట్టి నగలను చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



ఎయిడ్స్‌పై అప్రమత్తం

ఎయిడ్స్ స్మారక దినం సందర్భంగా చిత్తూరు నగరంలో ఆదివారం జిల్లా క్షయ నివారణ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

టీచర్లను వంచించిన కూటమి ప్రభుత్వం

– వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్ రెడ్డి విమర్శ



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం టీచర్లను వంచించిందని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం టీచర్లకు ఎన్నికలకు ముందు హామీలను ఇచ్చి ఊరించిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేకపోయిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విద్యాభివృద్ధి విధానాలే బాగున్నాయని టీచర్లు వాపోతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, సర్దుబాటు ప్రక్రియలతో ప్రాథమిక బడులు పూర్తిగా నష్టపోతాయన్నారు. 117 జీఓ రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా టీచర్లకు ఉరితాడు అందించినట్లు విమర్శించారు. బదిలీల షెడ్యూల్ విడుదలకు ముందు విద్యారంగం, టీచర్ల విషయంలో ఎలాంటి మార్పులు చేయదలిచారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి డిమాండ్‌లు పరిష్కరించకపోతే ఈనెల 21న డీఈఓ కార్యాలయ ముట్టడి ఉంటుందని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

డీఎస్సీ అభ్యర్థులకు నమూనా పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు పీఆర్‌టీయూ సంఘం ఆధ్వర్యంలో మోడల్ టెస్టులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు స్వామి కణ్ణన్ అన్నారు. ఆదివారం ఆ సంఘం నాయకులు డీఈఓ కార్యాలయంలో మోడల్ టెస్ట్ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు సంఘం ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించనున్నామన్నారు. త్వరలో నిర్వహించే ఈ పరీక్షలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రం.. ఎనీ టైమ్ మద్యం!

పవిత్ర తిరునగరంలో లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎనీ టైమ్ మద్యం విక్రయాలు సాగిస్తోంది. గోవిందనామస్మరణతో పులకించే పుణ్యభూమిని మందుబాబులకు అడ్డాగా మార్చేసింది. ప్రభుత్వ అండతో నిబంధనలను తుంగలో తొక్కేస్తోంది. స్థానికులతో పాటు శ్రీవారి భక్తులను లక్ష్యంగా చేసుకుని జేబులు నింపుకుంటోంది. రాత్రింబవళ్లు ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేపడుతోంది. గుడి గంటలు మోగకముందే వైన్ షాపులను తెరిచేస్తోంది. దైవ దర్శనం కంటే ముందే అనధికార పర్మిట్ రూమ్‌లలో మద్యం తాగేందుకు సహకారం అందిస్తోంది. మొక్కులు చెల్లించుకోకముందే భక్తులను మత్తులో ముంచేసి రూ.కోట్లు పోగేసుకుంటోంది. అక్రమార్జన కోసం ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి విశిష్టతను దెబ్బ తీసేందుకు తెగబడుతోంది.

మత్తులో జోగుతున్న తిరునగరం

- వేకువజామునే వైన్‌షాపుల్లో మొదలవుతున్న విక్రయాలు
- గుడి గంటలు మోగకముందే గ్లాసుల గలగలలు
- మందుబాబుల కేకలతో నిద్రలేస్తున్న తిరుపతి వాసులు
- లిక్కర్ మాఫియాను బయటపెట్టిన భూమన అభినయ్



మహిళలతో కలిసి మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న భూమన అభినయ్, నేతలు



తెరిచి ఉన్న మద్యం దుకాణం



మద్యం దుకాణం పక్కనే అనధికార పర్మిట్ రూమ్

సాక్షి ప్రతినిధి తిరుపతి : ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగరంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటికి అనుబంధంగా ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిట్‌రూమ్‌లను సైతం అందుబాటులోకి తీసుకువచ్చి మందుబాబులను పెంచి పోషిస్తున్నారు. వేలాది మందితో రద్దీగా ఉండే రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, వసతి సముదాయాలు, ఆలయ పరిసర ప్రాంతాలను మద్యం మాఫియా టార్గెట్ చేసుకుంది. నగరంలోని 14 దుకాణాలు అయితే ఉదయం 5గంటలకే తెరుచుకుంటున్నాయి. మరో 11 మద్యం షాపుల తలుపుతడితే 24గంటలు వెనుకవైపు నుంచి బాటిళ్లను అందిస్తున్నారు. దీంతో పాటు కొన్ని బార్ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని కలిస్తే నిమిషాలలో కావాల్సిన మద్యం దొరుకుతోంది. అలాగే కొందరు వైన్ షాపు యజమానులు ఫోన్ చేస్తే కస్టమర్లకు మద్యం డోర్ డెలివరీ కూడా చేయిస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా సాగుతున్న మద్యం విక్రయాలతో తిరుపతి నగరం మత్తులో తూలుతోంది.

గుట్టు రట్టు చేసిన అభినయ్

తిరుపతి నగరంలో ఇష్టారాజ్యంగా సాగిస్తున్న మద్యం అమ్మకాల గుట్టును వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి బహిర్గతం చేశారు. ఎనీ టైమ్ మద్యం దొరుకుతున్న పరిస్థితులను ఆదివారం వేకువజామున 5గంటలకు పార్టీ నేతలతో కలసి ఆయన వెలుగులోకి తెచ్చారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలోని నైన్‌స్టార్ వైన్‌షాపు తెరుచుకుని ఉండడం చూసి అభినయ్, ఇతర నేతలు ఆశ్చర్యపోయారు. అనధికార పర్మిట్‌రూమ్‌లో మందుబాబులు పెద్దసంఖ్యలో మద్యం తాగుతున్న విషయాన్ని మీడియా ముందుకు తీసుకువచ్చారు. అధికారులతో కుమ్మక్కైన వైన్‌షాపు యజమానులు సాగిస్తున్న మద్యం దందాతో తిరుపతి పవిత్రత మంటగలిసిందని భూమన అభినయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో నేరాలు, అసాంఘిక ఘటనలు పెరిగిపోవడానికి ఎనీ టైమ్ మద్యం కారణమని ఆరోపించారు. సంపద సృష్టి ఇదేనా చంద్రబాబూ...అంటూ అభినయ్ మండిపడ్డారు. సనాతన ధర్మ పరిరక్షకుడినని ప్రకటించుకున్న పవన్ కల్యాణ్‌కు ఈ అపవిత్ర ఘటనలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.



మద్యం విక్రయిస్తున్న దుకాణదారుడిని ప్రశ్నిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి పరిధిలో వైన్‌షాపుల వివరాలు

నగర జనాభా	సుమారు 4లక్షలు
మద్యం దుకాణాలు	45
బార్‌లు	13
అనధికారిక పర్మిట్ రూమ్‌లు	55
ఉదయం 5గంటలకే తెరుచుకుంటున్న షాపులు	14
24గంటలపాటు విక్రయాలు సాగిస్తున్నవి	11

నగర వాసుల ఆగ్రహం

తిరుపతిని మద్యం అడ్డాగా మార్చేశారని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడి, గుడి, నివాసాలు అనే తేడా లేకుండా వైన్‌షాపులు ఏర్పాటు చేశారని మండిపడుతున్నారు. ఇష్టారాజ్యంగా రాత్రింబవళ్లు మద్యం అమ్ముతుండడంతో మందుబాబుల ఆగడాలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. నిత్యం వారి అరుపులు, కేకలు, అసభ్య దూషణలతోనే నిద్రలేవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో ప్రశాంత వాతావరణం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం లిక్కర్ మాఫియాకు అమ్ముడుపోయారని విమర్శిస్తున్నారు. చివరకు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతను కూడా ప్రశ్నార్థకంగా మార్చేశారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

మద్యం పాలసీ అమలు చేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమైంది. నిబంధనల ప్రకారం వైన్ షాపులను ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు, బార్లను ఉదయం 10 నుంచి 11గంటల వరకు మాత్రమే తెరవాల్సి ఉంటుంది. అయితే తిరుపతి నగరలలో ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతున్నా నిలువరించలేని దుస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. చట్ట విరుద్ధంగా వైన్‌షాపులు నడుపుతున్నా చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. గతంలో సమయానికి మించి 5నిమిషాలు ముందు తెరవడం కానీ, 5నిమిషాల తర్వాత మూసివేయాలన్నా భయపడే పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం కూటమి నేతల అండదండలతో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. సమయ పాలన లేకుండా లిక్కర్ విక్రయాలు సాగిస్తోంది.




వెనుక తలుపు నుంచి విక్రయం



డీబీఆర్ హాస్పిటల్ రోడ్డులో..



కొత్తపల్లిమిట్ట రోడ్డులో..



శివజ్యోతి నగర్‌లో..



శ్రీకృష్ణనగర్‌లో..



సత్యనారాయణపురం రోడ్డులో..



దేవేంద్ర థియేటర్ రోడ్డులో..

ఆరిన ఆశాదీపాలు

వారంతా ముక్కుపచ్చలారని ఏడేళ్లలోపు చిన్నారులు.. సరదాగా గంతులేస్తున్న ఆ ముగ్గురి చిన్నారులను నీటి కుంట మృత్యుపాశం విసిరింది.. ఆ కుంటే తమ పాలిట మృత్యుకుహరమని గుర్తించలేకపోయారు..విగత జీవులుగా కుంటలో పడిన చిన్నారులను చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. లే.. కన్నా.... అమ్మను.. వచ్చాను .. నాన్నా లేరా.. అంటూ తల్లిదండ్రులు మృతి చెందిన బిడ్డలను హత్తుకొని బోరున విలపించడం దేవరాజపురం గ్రామస్తులను కంటతడి పెట్టించింది.. ఆ ప్రాంతం అంతా కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో దద్దరిల్లింది.

మృత్యుకుంట

- చిన్నారుల ప్రాణం తీసిన నీటి కుంట
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత
- తల్లడిల్లిన తల్లిదండ్రులు
- మృతుల కుటుంబాల ఆదుకుంటామన్న కలెక్టర్
- దేవరాజపురంలో విషాదఛాయలు



పిల్లల్ని మింగేసిన కుంట ఇదే

కుప్పంరూరల్ : అభం, శుభం ఎరుగని ముగ్గురు చిన్నారులు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు తమ అడుగుల్లో అడుగులు వేస్తూ... అల్లరి చేస్తూ.. సరదాగా ఆడుకుంటున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులను రాకాసి నీటి కుంట ప్రాణాలు తీసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మొదటి పిల్లలు ఒకేసారి మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. చిన్నారుల మృత్యువాతతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఈ ముగ్గురు చిన్నారుల విషాదం కుప్పం మండలం, దేవరాజపురంలో చోటు చేసుకుంది.

ముగ్గురు చిన్నారుల ప్రాణాలు తీసిన నీటి కుంట

కుప్పం మండలం దేవరాజపురం గ్రామానికి చెందిన యశోద, వరలక్ష్మి, రాజా. అక్కా, చెల్లెలు, తమ్ముడు. వీరందరూ ఒకే తల్లి బిడ్డలే. యశోదను తమిళనాడు రాష్ట్రం మదనజేరికి చెందిన శరవణతో 10 ఏళ్ల కిందట వివాహం చేసి పంపారు. వరలక్ష్మిని దేవరాజపురం నివాసి అయిన తిరుపతి అనే వ్యక్తికి ఇచ్చి 8 ఏళ్ల కిందట పెళ్లి చేశారు. రాజా అదే గ్రామానికే చెందిన సుమతిని పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. యశోద భర్త శరవణ రెండు నెలల క్రితమే విద్యుత్‌షాక్ గురై మృత్యువాత పడ్డాడు. ఈమెకు మొదటి కొడుకు అశ్విన్ (7)తో పాటు మరో కొడుకు, కుమార్తె ఉన్నారు. ఇక వరలక్ష్మికి సైతం గౌతమి (6) మొదటి కుమార్తె, తరువాత ఒక కుమారుడు, మరో కుమార్తె ఉన్నారు. రాజా కు సైతం షాలిని (7) మొదటి కుమార్తె. తరువాత ఒక కుమారుడు, మరో కుమార్తె ఉన్నారు. యశోద పిల్లల ను తీసుకొని వేసవి సెలవుల కోసం స్వగ్రామం దేవరాజపురం వచ్చారు. వీరి కుటుంబం ఆదివారం వరకు పిల్లలతో కిటకిటలాడుతూ సంతోషంగా ఉండేది. అ యితే వీరి పాలిట నీటి కుంట మృత్యుగీతం ఆలపించింది. వీరి కుటుంబంలో యశోద మొదటి కుమారు డు అశ్విన్ (7), వరలక్ష్మి పెద్ద కుమార్తె గౌతమి (6), రాజా పెద్దకుమార్తె షాలిని(7) కలిసి మెలిసి ఆడుకునేవారు. ఈ క్రమంలో వేడి ఎక్కువగా ఉండడంతో నీటి లో ఆడుకోవడానికి ఇంటి పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. ఏమి జరిగిందే ఏమో తెలియదు కానీ మధ్యాహ్నం 3 గంటలకు ఈ ముగ్గురు పిల్లలు కుంట లో మృతి చెంది విగత జీవులుగా పడి ఉన్నారు. చుట్టు పక్కల ఎవరు లేకపోవడంతో పిల్లలు ఎలా చనిపోయారో అన్న విషయం ఎవరికీ తెలియరాలేదు. తల్లిదండ్రులు పిల్లలు ఎంతటికీ రాకపోవడంతో వెతకగా నీటి వద్ద చూడగా విగత జీవులుగా పడి ఉన్న పిల్లల ను చూసి నిర్ఘాంతపోయారు. ఒక్కసారిగా రోదిస్తూ.. ఆర్తనాదాలు చేస్తూ పిల్లలను బయటికి తీశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు చనిపోవడం తల్లిదండ్రులు గుండె లవిసేలా రోదించారు. దీంతోగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుంత పూడ్చకపోవడంతోనే ఈ ఘోరం

గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి నిర్మాణం కోసం పక్కనే ఉన్న రైతు పొలంలో మట్టి కోసం ఓ గుంతను తవ్వారు. మట్టిని అయితే తీసుకున్నారు. కానీ గుంత పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలిపెట్టారు. దీంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కుంట వర్షపు నీటితో నిండింది. ఈ కుంట తమ ప్రాణాలు తీస్తాయని తెలియని ముగ్గురు చిన్నారులు అశ్విన్, గౌతమి, శాలిని ఆడుకునేందుకు వెళ్లి కుంటలో జారి మృత్యువాత పడ్డారు. గుంత 10 అడుగుల వెడల్పు, 7 అడుగుల మేర లోతు ఉండడంతో పిల్లలు తప్పించుకోలేక ప్రాణాలు వదిలినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుప్పం డీఎస్పీ పార్థసారథి తన సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పిల్లలు ప్రమాదవశాత్తు మృతి చెందారా... వేరే ఏవైనా కారణాలు ఉన్నాయా.. అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.



అశ్విన్ (ఫైల్)



గౌతమి (ఫైల్)

సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ భరత్

నీటి కుంటలో పడి చిన్నారులు మృత్యువాత పడ్డారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ వారి కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని రాష్ట్ర, జిల్లా అధికారులను కోరినట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : కలెక్టర్ సుమిత్ కుమార్

దేవరాజపురంలో ముగ్గురు చిన్నారులు దుర్మరణం విషయం తెలుసుకున్న చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాల సాయం చేయాలని కుప్పం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీ శాంతిపురం మండల కమిటీలో స్థానం పొందిన వారిని ఆదివారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో పార్టీ కోసం పనిచేసిన సామాన్య కార్యకర్తలను ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. పార్టీ అధికారం కోల్పోయాక అవకాశవాదులు పార్టీని వీడుతున్నారని అన్నారు. కానీ పటిష్టమైన క్యాడర్, అలుపెరగని యోధుల వంటి కార్యకర్తలు తమకు ఉన్నారని చెప్పారు. కష్ట కాలంలో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా నిలబడాలని కోరారు. క్రమశిక్షణ లేకుండా సొంత ఎజెండాతో పనిచేస్తూ నిరాధార విమర్శలతో పార్టీకి నష్టం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నూతనంగా పదవులు పొందిన అందరూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని కోరారు. అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లు, వేధింపులను అధిగమించటంలో నాయకులు, కార్యకర్తలకు పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండపాణి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు పెద్దన్న, విజయకుమార్, వినోద్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, నాధమణి, రమేష్ పాల్గొన్నారు.

టీచర్ల పోరుబాట

- 21న డీఈఓ కార్యాలయ ముట్టడికి ఐక్యవేదిక పిలుపు
- ఏకమైన అన్ని ఉపాధ్యాయ సంఘాలు



డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంతో ఢీ కొట్టేందుకు ఇక సమరమే అంటూ చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ టీచర్ల సంఘాలు డిమాండ్‌ల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదికగా ఏకమయ్యారు. ఆ సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్జీవో సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు శవన్నగారి బాలాజీ, గిరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం టీచర్ల సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాల్సిందేనని డిమాండ్ చేశారు.

ముట్టడిని జయప్రదం చేయండి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు, వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు ఈనెల 21న ఉమ్మడి చిత్తూరు డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ముట్టడిని జయప్రదం చేయాలని రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు జీవీ రమణ కోరారు. 117 జీఓను రద్దును కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ఆరుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించడం ఏమిటని ప్రశ్నించారు.

అధికంగా మిగులు పోస్టులు

కూటమి ప్రభుత్వం చేపడుతున్న వింత నిర్ణయాల వల్ల అధికంగా టీచర్ల పోస్టులు మిగులుతున్నాయని ఐక్యవేదిక సంఘం నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, మణిగండన్, కణ్ణన్ విమర్శించారు. వారు మాట్లాడుతూ మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ స్కూల్స్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మిగులుతున్నాయన్నారు. హైస్కూల్స్‌లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించి 46 మంది విద్యార్థులకు రెండవ సెక్షన్ ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు చెంగల్రాయమండడి, రహ్మద్, మునాఫ్, ముత్యాల రెడ్డి, మణిగండన్, మునీర్ అహమ్మద్,దొడ్డ ఉమామహేశ్వర్, కిరణ్ కుమార్, చిట్టిబాబు, గోవిందస్వామి, విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మంజునాథ్ గుప్తా, నాగరాజరెడ్డి, రెడ్డప్ప నాయుడు, దండు రామచంద్రయ్య, ఎస్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున స్వామికి అభిషేక పూజలు చేసి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు దర్శనం భాగ్యం కల్పించారు. అప్పటి నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర, వీఐపీ దర్శన సేవ క్యూలైన్లు కిటకిటలాడాయి. వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు.

మైనర్లు బండి నడిపితే జరిమానా



మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

చిత్తూరు అర్బన్ : మైనర్లు బండి నడిపితే జరిమాన తప్పదని డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. చిత్తూరు నగరంలో ఆదివారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవర్‌లో చాలా మంది మైనర్‌లు పట్టుబడ్డారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలకు బండి ఇచ్చి రోడ్డుపైకి పంపిస్తే కఠిన చర్యలు ఉంటాయని, జరిమానా విధిస్తామని తల్లిదండ్రులకు డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సీఐలు నెట్టికంతయ్య, ఉమామహేశ్వర్, ఎస్‌ఐలు రమేష్‌బాబు, మల్లికార్జున, సుగుణ ఉన్నారు.

ఏకలవ్య కాలనీ కథా సంపుటికి పురస్కారం



పలమనేరు బాలాజీ

పలమనేరు : స్థానిక కవి, విమర్శకుడు పలమనేరు బాలాజీ రాసిన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి సడ్లపల్లి సాహిత్య పురస్కారం 2025కు ఎంపికైనట్లు బాలాజీ ఆదివారం తెలిపారు. హిందూపురానికి చెందిన సడ్లపల్లి సాహిత్య సంస్థ నిర్వాహకులు సడ్లపల్లి చిదంబరరెడ్డిని నుంచి సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. త్వరలో హిందూపూర్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురష్కారాన్ని అందుకోనున్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ చెప్పారు.

కొందరికే సుఖీభవ



మడకతో విత్తు విత్తుతున్న దృశ్యం (ఫైల్)

'అన్నదాత సుఖీభవ' పథకం అమలులో అన్నదాతకు గుండెకోత మిగులుస్తోంది. అండగా నిలవాల్సిన ప్రభుత్వం నిబంధనల కత్తి వేలాడదీస్తోంది. పేర్ల తప్పిదాలకే అర్హత కోల్పోయేలా ఆంక్షలు అమలు చేస్తోంది. ఏడాదిగా ఊరించిన ఈ పథకానికి సవాలక్ష సాకులు వెతికి రైతన్నలను మానసిక క్షోభకు గురిచేస్తోంది. గత ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందించి అండగా నిలబడింది. అయితే కూటమి ప్రభుత్వం ఏడాదిగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా కాలయాపన చేసింది. ప్రస్తుతం నిబంధనల పేరుతో పథకానికి రైతన్నలను దూరం చేస్తోంది.

- అన్నదాత సుఖీభవకు బోలెడు నిబంధనలు
- సవాలక్ష ఆంక్షలతో అమలుకు సమయాత్తం
- రైతు భరోసా సిబ్బంది చేతికి వెబ్‌ల్యాండ్
- తప్పిదాలను తోసిపుచ్చుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

జిల్లా సమాచారం

రైతు భరోసా సంఖ్య -	502
వెబ్‌ల్యాండ్‌లోని రైతుల సంఖ్య -	386023
వెబ్‌ల్యాండ్‌లో పరిశీలన పూర్తయిన రైతుల సంఖ్య -	98326
తప్పుల పేరుతో మళ్లీ పరిశీలనకు పంపిన రైతులవి -	4 వేలు (సుమారు)

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. ఆర్థిక భరోసా ఇస్తూ.. వ్యవసాయ రంగాన్ని పరుగులు పెట్టించింది. రైతులకు వరాల జల్లులు కురిపించింది. ధైర్యంగా పంట సాగు చేసే ధీమాను కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను చిన్నచూపు చూస్తోంది. ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. ఏడాది కాలం సమీపించడంతో అన్నదాత సుఖీభవను తెరపైకి తీసుకొస్తోంది. ఈ పథకం వర్తించాలంటే షరతులు వర్తిస్తాయంటూ మెలికలు పెడుతోంది. నిబంధనల పేరుతో కోతలు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. నిబంధనలు రైతులకు తీవ్ర నష్టం కలిగేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి.

పేర్లు తప్పులున్నాయని..


వైఎస్సార్‌సీపీ పాలనలో గత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్ ల్యాండ్ వివరాలే ఆధారంగా ఐదేళ్ల పాటు రైతు భరోసా పథకాన్ని నిర్విఘ్నంగా అందించారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగలేదు. అందరి రైతుల్లో సంతోషం కనిపించేది. అధికారుల పరిశీలన, నివేదికలు అంటూ హడావుడి ఎక్కడా కనిపించేది కాదు. ఒక్క రైతు కూడా ఈ పథకం అందలేదన్న ఫిర్యాదు లేకుండా పథకం కొనసాగించారు. కేంద్రం వాటా రూ.6,500, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,500 కలిపి రూ.13,500 గత ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిబంధనల పేరుతో లబ్ధిదారులైన రైతుల జాబితాలో కోతలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పేర్లు తప్పులున్నాయని, ఆధార్ తప్పులున్నాయని, చిన్న చిన్న పొరబాట్లు ఉన్నాయని ఇప్పటి వరకు వెబ్‌ల్యాండ్ నుంచి సుమారు 4 వేల మందిని పరిశీలనకు పంపారు. వాటిని రైతులు రెవెన్యూ కార్యాలయాల్లో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. దీనిపై రైతులకు సరైన అవగాహన లేదు. వాటిని పరిష్కరించేందుకు అవగాహన ఉన్న రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా ఈ వెబ్ ల్యాండ్ పరిశీలన ప్రక్రియ ఈనెల 20వ తేదీతో ముగియనుంది.

అర్హతలను చూస్తే...

వ్యవసాయ రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్ ల్యాండ్‌లో వివరాలు చూసుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు లాగిన్ సౌకర్యం కల్పించింది. స్థానిక అధికారులు మొదట వెబ్ ల్యాండ్ రైతుల వివరాలు పరిశీలిస్తారు. అర్హులైన రైతులని గుర్తిస్తే కింది స్థాయి అధికారి అవే వివరాలతో పై స్థాయి అధికారికి, అక్కడి నుంచి వ్యవసాయశాఖ కమిషనర్‌కు నివేదిక చేరుతుంది. తర్వాత కమిషనర్ కార్యాలయంలో ఏ రైతుల పేరిట ఆదాయపన్ను ఉంది. వారికి సంబంధించిన ఇతరా ఆస్తుల వివరాలను తెలుసుకుంటారు. అర్హులు కాని రైతులను గుర్తించి వారిని జాబితా నుంచి తొలగిస్తారు. కమిషనర్ కార్యాలయం ఎంపిక చేసిన రైతుల జాబితా మళ్లీ కింది స్థాయి అధికారులకు పంపుతారు. వీరు పరిశీలించాక అదే జాబితాలోని రైతుల అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు నిర్ణయిస్తాయి. చివర్లో ఈ పథకానికి ఎంపిక చేసిన ప్రతి రైతూ ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలనే నిబంధన పెట్టారు లేకుంటే రైతులకు ఆర్థిక సాయం రాదని అధికారులు చెబుతున్నారు.

ఏడాదిగా విస్మరించి..

జిల్లాలో 3.86 లక్షల మంది రైతులున్నారు. ఇందులో 1.80 లక్షల మంది అన్నదాత సుఖీభవకు అర్హులుగా ఉన్నారు. వీరికి గత ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఎగ్గొట్టింది. ఒక్కో రైతుకు ఇస్తామన్న రూ.20 వేలు ఇచ్చుంటే.. జిల్లా రైతాంగానికి రూ.300 కోట్ల మేర లబ్ధి కలిగేది. దీనిని విస్మరించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కోతలు పెట్టేందుకు సిద్ధమైంది.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా లబ్ధి వివరాలు

సంవత్సరం	రైతులసంఖ్య	నగదు జమ (రూ. కోట్లలో)
2019-20	2,20,256	165.19
2020-21	2,31,083	173.52
2021-22	2,16,594	162.45
2022-23	2,23,165	211.12
2023-24	2,31,144	174.03

రైతులకు ఇబ్బందులు లేకుండా..



అన్నదాత సుఖీభవకు సంబంధించి వెబ్‌ల్యాండ్ పరిశీలన జరుగుతోంది. క్షుణంగా పరిశీలించి ఈ ప్రక్రియ చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు రానివ్వం. వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. రైతులు కూడా మీ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే తెలుసుకొని పరిష్కరించుకోండి. ముఖ్యంగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ అనుసంధానం చేసుకోవాలి.

– మురళీ కృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

పెరుమాళ్లకండ్రిగలో తమ్ముళ్ల బాహాబాహీ

– ఆగిన గ్రామకమిటీ ఎన్నిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు మండలం పెరుమాళ్ల కండ్రిగలో తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ఆదివారం గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నిక జరిగింది. పార్టీ పెద్దలు, సీనియర్ల సమక్షంలో కమిటీ ఎన్నికను నిర్వహించారు. అయితే ఎన్నిక ప్రక్రియ ఆరంభంలో రచ్చ..రచ్చగా మారింది. పార్టీలోని ఇరువర్గాలకు ఘర్షణ పడ్డారు. టీడీపీ నేత చంద్రప్రకాష్‌ను ఎందుకు మా ఇంటికి రాకుండా చేశారంటూ మాజీ సర్పంచ్ అందరి సమక్షంలో వాదనకు దిగారు. ఆపై రజనీబాబు వర్గం తులసిపతినాయుడుపై చిందులేసింది. తర్వాత గ్రామ కమిటీ అధ్యక్షుడు తన వర్గానికే కావాలని ఇరువర్గాలు పట్టుబట్టాయి. ఒక్క ఓటు లేని వ్యక్తికి కమిటీ అధ్యక్షుడు ఎలా ఇస్తారంటూ తులసిపతినాయుడు ప్రశ్నించడంతో రజనీనాయుడు వర్గంలోని యువకులు కయ్యానికి కాలు దువ్వారు. ఆపై ఇరువర్గాలు నువ్వా.. నేనా అంటూ వీధిన పడి బండబూతులు తిట్టుకున్నారు. దీంతో గ్రామ కమిటీ ఎన్నికను ఆపేశారు. అలాగే దిగువమాసాపల్లిలో అధ్యక్ష ఎన్నిక గందరగోళంగా సాగింది. పదవి కోసం ఇరువర్గాలు పోటీలు పడ్డాయి. చివరకు పార్టీ పెద్దలు సర్దుబాటు చేసి కుమార్‌కు అధ్యక్ష పదవి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

మోటారు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా చంద్రశేఖర్

చిత్తూరు అర్బన్ : జిల్లా పోలీసుశాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (ఎంటీఓ)గా చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంటీఓగా పనిచేస్తున్న భాస్కర్‌ను మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఇటీవల ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో పోస్టింగు ఇవ్వకుండా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలుస్తోంది. చిత్తూరు హోంగార్డు విభాగం బాధ్యతలు చూస్తున్న ఆర్ఐ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు.

గంగమ్మ తేజస్సు



విద్యుత్ దీపాలంకరణలో ఆకర్షణీయంగా గంగమ్మ ఆలయం

కుప్పం : శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఈ ఏడాది ఆలయ అలంకరణ కనులపండువగా నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. చలువ పందిళ్లు , వినూత్నంగా ఆలయ అలంకరణ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఆలయ ముఖ ద్వారాల మార్గం పాతపేట వైపు చెరువు కట్ట వరకు , కొత్త పేట వైపు రైల్వే గేటు వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైట్లతో అలంకరించారు. అంతేకాకుండా అమ్మవారి ప్రతిమలతో పట్టణ సరిహద్దులో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పట్టణంలో విద్యుత్ కాంతులతో గంగమ్మ జాతర ఆకర్షణీయంగా మారింది.

నేడు అగ్నిగుండ ప్రవేశం

తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకుని సోమవారం రాత్రి అగ్ని గుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎంకే రవిచంద్ర తెలిపారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలో ఆదివారం జిల్లా క్షయ నివారణ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఒక్క నిమిషం మౌనం పాటించారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. తర్వాత జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు మండలం చెర్లోపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థులు స్వచ్ఛ సేవాపై ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధిపై రైతులకు వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాడకంపై తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శైలజ, ప్రశాంతి పాల్గొన్నారు.






ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

వి.కోట: ఓ ఆర్టీసి బస్సు అదుపు తప్పి బస్టాండ్ పక్కనున్న పెద్ద పల్లంలోకి జారి వెనక్కు ఒరిగిపోయిన సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు పలమనేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వి.కోట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సును రివర్స్ తీసే క్రమంలో అదుపు తప్పింది. ఈ క్రమంలో బస్సు వెనుక రెండు చక్రాలు దాదాపు 10 అడుగుల గల పల్లంలోకి జారి వెనక్కు ఒరిగిపోయి ఇరుక్కుపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

గంజాయి స్వాధీనం..విక్రేత అరెస్టు



అరెస్టు చూపుతున్న పోలీసులు

ఐరాల : గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని గుండ్లపల్లె ఎస్టీ కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తహసీల్దార్ మహేష్‌కుమార్, సీఐ, ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి ఎస్టీ కాలనీకి వెళ్లగా, గంజాయి విక్రయిస్తున్న సునీత(45) పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా ఆమెను పట్టుకుని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 2.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చిత్తూరు కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

నగల దొంగలు అరెస్టు

పూతలపట్టు (కాణిపాకం) : బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసిన నలుగురు దొంగలను పూతలపట్టు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ సాయినాథ్ సమక్షంలో అరెస్ట్ చూపించారు. అనంతరం చోరీ వివరాలను వెల్లడించారు. పూతలపట్టు మండల కేంద్రంలో ఈనెల 5వ తేదీన పూతలపట్టు మండల కేంద్రంలోని ఇళ్లల్లో చోరీ జరిగింది. వెండి 650 గ్రాములు, బంగారం 650 గ్రాములను అపహరించారని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు వేగవంతం చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం రంగపేట వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానితంగా కనిపించిన కారు, ద్విచక్ర వాహనంను ఆపి విచారించామన్నారు. ఈ విచారణలో తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లాకు చెందిన యువరాజ్(32), మురుగన్(27), మధురైకు చెందిన రాజా(38), చెన్నైకు చెందిన శ్రీకాంత్(22)ను పట్టుకోవడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. అనంతరం సీఐ కృష్ణమోహన్, ఏఎస్‌ఐ దేవరాజులరెడ్డి, సిబ్బంది రవికుమార్, శ్రీనివాసులు, సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, గణేష్ తదితరులను సన్మానించారు.

సీసీపై ఫిర్యాదు

చిత్తూరు కార్పొరేషన్ : జెడ్పీ పూర్వ సీఈఓ సీసీ సురేంద్రరెడ్డి పై విశ్రాంత ఎంపీడీఓ కనకరాజులనాయుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జెడ్పీ ఉద్యోగులను పలు అంశాలపై వేధించాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎంఓ, డిప్యూటీ సీఎం, పీఆర్ కమిషనర్, కలెక్టర్, జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేయాలని జెడ్పీ సీఈఓకు ఆదేశాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న డాక్టర్ మునీంద్రనాయక్, చెన్నరాయుడు

పుంగనూరు : తిరుపతి శ్రీ విద్యానికేతన్‌లో బీటెక్ చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై దాడిని పలు సంఘాల నాయకులు ఖండించారు. ఆదివారం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్, దళిత నాయకుడు చెన్నరాయుడు కలిసి విలేకరుల సమావేశంలో దాడిని ఖండించారు. అలాగే మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్.అశోక్ ఆధ్వర్యంలో మాలమహానాడు నేతలు దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదువుతున్న దళిత విద్యార్థిపై అమానుషంగా ప్రవర్తించి, తీవ్రంగా కొట్టి గాయపరిచిన కేసులో అగ్రవర్ణాలైన నిందితులపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో పోలీసులు నిజాయతీగా దర్యాప్తు చేసి, బాధ్యులను అరెస్ట్ చేయాలని కోరారు. సమావేశంలో వెంకటరమణ, హనుమప్ప, శ్రీనివాసులు , నాగ, భాస్కర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటే సమయంలో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకుజామున మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి లేత పసుపు రంగు కలిగిన చొక్కా, బ్లూకలర్ పంచ ధరించాడని, వృద్ధుడి వివరాలు తెలిసిన వ్యక్తులు 9491074515 నంబరును సంప్రదించాలని ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇళ్లు

– కాలిపోయిన గృహోపకరణాలు, నిత్యావసరాలు




కాలిపోయిన వస్తువులు

వెదురుకుప్పం : పిడుగుపాటుకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.. ఇంట్లో వస్తువులు కాలిబూడిదైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటన మండలంలోని బండమీద ఇండ్లలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని బండమీద ఇండ్లలో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. వెదురుకుప్పంలో 90.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పెద్ద శబ్దాలతో కూడిన ఉరుములు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో గ్రామంలోని శ్యామలకు చెందిన ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలిపోయాయి. విద్యుత్ వైర్ల షార్టుసర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అదేవిధంగా ఇంట్లో నిల్వ ఉంచిన 20 బస్తాల బియ్యం, 5 బస్తాల వేరుశనగ, 50 కేజీల బియ్యం అగ్నికి ఆహుతైనట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం పగులగొట్టి చోరీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ఇంటికి తాళం వేసి ఉండగా పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. దీనిపై ఆదివారం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని మిట్టూరుకు చెందిన భాను దంపతులు ఈనెల 17న సాయంత్రం వారి బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న దాదాపు రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు



హాజరైన ఎన్‌సీసీ కేడెట్లు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కల్నల్ నోయల్ వివేక్ మోనిస్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నోయల్ వివేక్ మోనిస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభించారు. కమాండింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ.. పది రోజుల పాటు నిర్వహించే శిక్షణలో కేడెట్‌లకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సర్దుబాటు, ప్రవర్తన, సమయపాలన, ఆరోగ్య అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్యాంపులో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 540 మంది కేడెట్‌లు పాల్గొన్నారు. కేడెట్‌లకు ప్రత్యేక శిక్షణతో పాటు తలసేన క్యాంపునకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెట్ మేజర్ లోకనాథమ్, ఎన్‌సీసీ ఆఫీసర్‌లు శ్రీలత, చిరంజీవి, యుగంధర్, ధనంజయులు పాల్గొన్నారు.